క్లుప్తంగా

నేడు రాచపల్లిలో 'గడప గడపకు'

మాకవరపాలెం: రాచపల్లిలో బుధవారం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్ తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీగా హాజరు కావాలని కోరారు.

శీతాకాలంలో ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి జాహ్నవి

కె.కోటపాడు: శీతాకాలంలో వృద్ధులు, చిన్నారులు ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి జాహ్నవి అన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా మంగళవారం గవరపాలెంలో ఆరోగ్య సేవలందించారు. ఓపీ ద్వారా 113 మందితోపాటు అచేతన స్థితిలో ఇంటి వద్ద ఉన్న 9 మందికి వైద్యం అందించడంతో పాటు ఉచితంగా మందులు ఇచ్చారు. వైద్యాధికారి తిలక్, హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, రమణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఘన సన్మానం



సన్మానించి, నిత్యావసరాలు అందిస్తున్న సర్పంచ్ దంపతులు

రావికమతం: కవగుంటలో పారిశుధ్య కార్మికులు, ఇతర సిబ్బంది నలమాటి పెద కళ్యాణం, కోడి అప్పారావు, ఎలక్ట్రీషియన్లు రొబ్బా భాస్కరరావు, షేక్ వెంకటీలను సర్పంచ్ దాసరి సూర్యకుమారి, వరహాలు దంపతులు మంగళవారం ఘనంగా సన్మానించారు. అనంతరం వారికి దుస్తులు, బియ్యం, నగదు పంపిణీ చేశారు. వారి సేవలను ప్రశంసించారు. నాయకులు వరకుమారి, నాగేశ్వరరావు, నాయుడు బాబు, రాజన్న యూత్ అధ్యక్షుడు చేపూరి శేషు పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో చింతలూరు



చింతలూరు తారు రోడ్డు

మాడుగుల: చింతలూరు ప్రగతి పథంలో పయనిస్తోంది. సర్పంచ్ కాళింగ కళ్యాణరాజు కృషితో సకల సదుపాయాలు చేకూరుతున్నాయి. ఇక్కడ 1,500 మంది జనాభా ఉంది. రూ. 90 లక్షలతో ఇంటింటికీ కుళాయి పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రతి వీధికి సీసీరోడ్లు నిర్మించారు. పొలాలకు సాగు నీటి ఇబ్బందులు లేకుండా రూ. 60 లక్షలతో చెరువును బాగు చేశారు. వీరనారాయణం మెయిన్ రోడ్డు నుంచి గ్రామానికి రూ.48 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించారు.

శిక్షణ కేంద్రం వద్ద చురుగ్గా ఏర్పాట్లు



నక్కపల్లి శిక్షణ కేంద్రం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో

నక్కపల్లి: క్లీన్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. నక్కపల్లిలో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం వద్ద త్వరలో ప్రారంభమయ్యే ఈ శిక్షణా తరగతులకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణలు తెలిపారు. ఈ పునఃనిర్మాణ పనులను మంగళవారం వారు పరిశీలించారు. ఈ శిక్షణ కేంద్రం నర్సీపట్నం డివిజన్‌లో 8 మండలాలకు చెందిన కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్వీపర్లకు క్లీన్ ఆంధ్రప్రదేశ్, జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ, వాటిని సంపద తయారీ కేంద్రాలకు తరలింపు, అక్కడ వేరు చేసే విధానం, వానపాములను ఉపయోగించి వర్మికంపోస్టు తయారీ చేసే విధానంపై ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. నర్సీపట్నం డివిజన్‌కు సంబంధించి మండలాలకు త్వరలో ఈ శిక్షణ ప్రారంభమవుతుందన్నారు.

తీర్థాల కోలాహలం

వైభవంగా దండుముత్యాలమ్మ తీర్థం



దండుముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామ పెద్దలు

కె.కోటపాడు: గొండుపాలెం గ్రామ దేవత దండుముత్యాలమ్మ తీర్థాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతోపాటు దేవరాపల్లి, చోడవరం, చీడికాడ మండలాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి, మాజీ సర్పంచ్ వంటాకు శ్రీను, వైస్ ఎంపీపీ బండారు మంగపతి, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు. భక్తులకు కానిస్టేబుళ్లు కూండ్రపు సూర్యనారాయణమూర్తి, రమేష్ ప్రసాద వితరణ చేశారు.

రావికమతం: గొంప మెట్టపై భీమలింగేశ్వరస్వామి తీర్థం మంగళవారం వైభవంగా జరిగింది. పలు గ్రామాల ప్రజలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మెట్టపై నుంచి పచ్చని ప్రకృతిని తిలకించి ఆస్వాదించారు. కొత్తకోటలో కోటవారి రామ మందిరం వద్ద తీర్థం ఘనంగా నిర్వహించారు.

సాగరంలో..

మాడుగుల: సాగరం గ్రామంలో మంగళవారం రాములోరి తీర్థం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు రాములోరిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ తీర్థానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

సాలికమల్లవరంలో..

గొలుగొండ: సాలికమల్లవరంలో మంగళవారం తీర్థం ఘనంగా నిర్వహించారు. ఇక్కడ రామాలయం వద్ద ఈ ఉత్సవానికి జోగుంపేట, పాతజోగుంపేట, జమ్మెదేవిపేట, వెంకటాపురం, పుగచెట్లపాలెం గ్రామాల భక్తులు అధికంగా తరలివచ్చారు. సాయంత్రం పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

కె.జె.పురంలో...

మాడుగుల రూరల్: కె.జె.పురంలో సంక్రాంతి పండగ నుంచి ఈ నెలాఖరి వరకు రోజూ తీర్థాలు నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా మంగళవారం మోదమాంబ అమ్మవారి తీర్థం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

నేడు, రేపు కె.జె.పురంలో తీర్థాలు

కె.జె.పురం గ్రామ శివారు తెలకలదీపంలో అక్కమ్మ పేరంటాలు తీర్థం బుధవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 19న కె.జె.పురంలో గ్రామ ప్రధాన ఇలవేల్పు శ్రీరాములు వారి తీర్థం ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ జామి రమణబాబు, ఉప సర్పంచ్ కాళ్ల కోటమ్మ తెలిపారు.

ఘనంగా ఎరకాలమ్మ తీర్థం



రైవాడ జలాశయానికి పోటెత్తిన భక్తజనం

దేవరాపల్లి: రైవాడ గ్రామస్తుల ఆరాధ్య దైవం ఎరకాలమ్మ తీర్థం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రైవాడ జలాశయం వద్ద ఆలయానికి తెల్లవారుజాము నుంచి అమ్మవారిని వేలాది భక్తులు దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. సర్పంచ్ చల్లా లక్ష్మి, వైస్ ఎంపీపీ ఉర్రూకుల గంగాభవానీ, మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు, కె.ఎస్. అప్పలనాయుడు తదితర గ్రామ పెద్దలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా క్రికెట్, కబడ్డీ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. తీర్థం సందర్భంగా రైవాడ జలాశయానికి భక్తజనం పోటెత్తారు. దీంతో జలాశయం పరిసరాలు కనుచూప మేర కిక్కిరిసింది.

ఘనంగా నారితల్లమ్మ తీర్థం....

ఎస్.జి.నగరంలో నారితల్లమ్మ పేరంటాలు తీర్థం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల పోటీలు హోరా హోరీగా సాగాయి. విజేతలుగా నిలిచిన ఎడ్ల బళ్లకు రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ. 8 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల చొప్పున బహుమతులను అందజేశారు.

ఏ.కొత్తపల్లిలో జిల్లా స్థాయి మహిళా కబడ్డీ పోటీలు నేడు

దేవరాపల్లి: ఏ. కొత్తపల్లిలో ముత్యమాంబ అమ్మవారి తీర్థాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయి మహిళా కబడ్డీ పోటీలను బుధవారం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి తెలిపారు. ఈ పోటీల్లో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ. 2 వేల చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. రాత్రికి పౌరాణిక నాటక, డ్యాన్స్ బేబి డ్యాన్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.



గొంప భీమలింగేశ్వర స్వామి తీర్థంలో జన సందోహం



కొత్తకోట కోట వీధి రామ మందిరం వద్ద ప్రత్యేక భజన

ప్రమాదకర కల్వర్టుల వద్ద గోతులు పూడ్చివేత



కల్వర్టు గోతులు పూడ్చి చదును చేసిన దృశ్యం



పి.పొన్నవోలులో కల్వర్టు వద్ద ఏర్పాటు చేసిన రేడియం స్టిక్కర్లు

సాక్షి ఎఫెక్ట్..

రావికమతం: నర్సీపట్నం–భీమునిపట్నం రోడ్డులోని టి.అర్జాపురం – రావికమతం మధ్య కల్వర్టుల వద్ద మంగళవారం ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేశారు. రహదారి విస్తరణలో భాగంగా నిర్మిస్తున్న కల్వర్టుల వద్ద పెద్ద గోతులు తవ్వి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వదిలేశారు. ఆ గోతుల్లో ఇప్పటికే పలువురు పడి తీవ్ర గాయాల పాలయ్యారు. మంగళవారం రాత్రి కోటవురట్లకు చెందిన గట్టి వీరరాఘవులు పడిపోయి మృతి చెందిన సంగతి తెలిసిందే. దీనిపై సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. ఆయా కల్వర్టుల వద్ద రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయడమేగాక 90 శాతం నిర్మించిన కల్వర్టులను పూర్తి చేసి ప్రమాదానికి ఆస్కారం లేకుండా కప్పివేశారు.

వేడుకగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న సర్పంచ్ వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ రమణ

రోలుగుంట: గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా జె.నాయుడుపాలెంలో గ్రామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించి ఉత్సవ స్థలంలో ఉంచారు. ఆ సమయంలో చిడతల భజన, కోలాటం, తప్పెటగుళ్ల తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సర్పంచ్ బగుడు వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ నక్కా రమణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

22న మేథ్స్ టాలెంట్ టెస్ట్

చోడవరం రూరల్: స్థానిక కందర్ప కాలనీ ఎంపీయూపీ పాఠశాలలో ఈ నెల 22న పదో తరగతి విద్యార్థులకు మేథ్స్ (గణితం) ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నట్టు డాక్టర్ త్యాగరాజు చెల్లూరి మెమోరియల్ ట్రస్టు నిర్వాహకుడు ఏడ్వకేట్ చెల్లూరి కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిషు, తెలుగు మీడియాల్లో పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలతో పాటు జ్ఞాపికలు అందచేస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు మాత్రమే ఉదయం 10 గంటల లోపు హాజరు కావాలని కోరారు.

పరీక్ష కేంద్రాలు పరిశీలించిన ఏఎస్పీ



పట్టణంలో పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్

తుమ్మపాల: ఈ నెల 22వ తేదీన జరగనున్న పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలను అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్ మంగళవారం పరిశీలించారు. అనకాపల్లి పట్టణ పరిధిలో 11 పాఠశాలల్లో 12 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో తరగతి గదులు, విద్యుత్, మంచినీరు వంటి మౌలిక సౌకర్యాలను పరిశీలిస్తున్నామన్నారు. అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ బి.సునీల్, పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



అల్లూరి పార్కులో సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు

గొలుగొండ: అల్లూరి పార్కులో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూలకు చెందిన 2003 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా 20 సంవత్సరాల తర్వాత కలుసుకుని ఆనాటి బాల్య స్మృతులు నెమరువేసుకున్నారు. తాము చదివిన పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయం చేయాలని నిర్ణయించుకున్నారు.

వాయిద్య కళాకారుడికి ఘన సన్మానం



నారాయణరావును సన్మానిస్తున్న సభ్యులు

మాడుగుల రూరల్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా వాయిద్య కళాకారుడు పేలూరి వెంకట నారాయణరావును సన్మానించారు. భారత నిర్మాణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మాడుగులలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను ట్రస్టు సభ్యులు సోమవారం రాత్రి సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. మండల వాసు, గౌరీపట్టపు మహేశ్, భమిడిపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి, తవ్వా సన్యాసిశెట్టి పాల్గొన్నారు.

చెరువు గట్టుపై పూరిళ్ల వాసుల సమస్య పరిష్కరిస్తా

గడప గడపకు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



ప్రజలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం: మా కష్టాలు తెలుసుకుని పథకాలన్నీ నేరుగా మా ఇంటికే అందిస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అర్హతను బట్టి మాకందరికీ పథకాలు మంజూరయ్యాయి. అని మహిళలు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఎదుట ఆనందం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా చోడవరం సచివాలయం–3 పరిధి ఎడ్లవీధి, చినబజార్, రామకోవెల, చెరువుగట్టు ప్రాంతాల్లో మంగళవారం ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎడ్లవీధి చెరువు గట్టుపై కొన్నేళ్లుగా పూరిళ్లలో నివసిస్తున్న లబ్ధిదారులంతా ఇంటి స్థలం పట్టాలు ఇప్పించాలని కోరారు. దీనిపై అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ధర్మశ్రీ భరోసా ఇచ్చారు. వలంటీర్ల సేవలను స్థానికులు ప్రశంసించారు. 7వ వార్డులో పలు సమస్యలను విన్నవించగా, వాటిని పరిష్కరిస్తామని ధర్మశ్రీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఓటీఎస్ ఇంటి హక్కు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ బండారు సత్యనారాయణ, ఎంపీపీ గాడి కాసు, తహసీల్దార్ తిరుమలరావు, ఈవోపీఆర్డీ చైతన్య, పంచాయతీరాజ్ డీఈఈ ప్రసాద్, వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, బుద్ద గంగరాజు, పంచాయతీ ఈవో నారాయణరావు, సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, వార్డు మెంబరు ఓరుగంటి నాగమణి, ఎంపీటీసీ పొట్నూరి అరుణ, సచివాలయ కన్వీనర్ సిద్దాబత్తుల వాసు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలి

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును కలిసిన నాలుగు మండలాల ఇన్‌చార్జులు

దేవరాపల్లి: గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడానికి జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల (జేసీఎస్)తో కలిసి మండల ఇన్‌చార్జులు సమష్టిగా కృషి చేయాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సూచించారు. నియోజకవర్గంలో మాడుగుల మండలానికి బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, దేవరాపల్లి మండలానికి కొట్యాన వెంకటరమణ, కె.కోటపాడు మండలానికి ఏటుకూరి అప్పలరాజు, చీడికాడ మండలానికి ఈర్లె చైతన్య జేసీఎస్ ఇన్‌చార్జులుగా నియమితులయ్యారు. వీరు మంగళవారం తారువలో డిప్యూటీ సీఎంను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా 2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధితోపాటు నిర్దేశించే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. జెడ్పీటీసీ కర్రి సత్యం పాల్గొన్నారు.

తులసీరావు సంతాప సభకు తరలిరండి



మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణ

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్ర పాడి రైతుల పెన్నిధి విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు సంతాప సభకు అన్ని గ్రామాల నాయకులు, రైతులు తరలిరావాలని డైరెక్టర్ గేదెల సత్యనారాయణ కోరారు. మంగళవారం కొమ్మళ్లపూడి విశాఖ డెయిరీ బల్క్ కూలింగ్ కేంద్రం వద్ద రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల నాయకులు, రైతు సంఘ నాయకులు, డెయిరీ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. బుధవారం యలమంచిలిలో తులసీరావు సంతాప సభకు వెళ్లేందుకు ప్రతి గ్రామంలో పాల కేంద్రం నుంచి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశామన్నారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూరి నాగేశ్వరరావు, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దేవర అప్పారావు, కాపు సంఘం మండలాధ్యక్షుడు ముచ్చకర్ల అప్పారావు, సూపర్‌వైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆటల పోటీలతో మరింత ఉత్సాహం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సర్పంచ్ పైల శిరీషా

నాతవరం: గ్రామాల్లో ఆటలు పోటీలు నిర్వహించడం ఎంతో ఆనందాయకంగా ఉందని సర్పంచ్ పైల శిరీషా తెలిపారు. మంగళవారం సాయంత్రం చెర్లోపాలెంలో పలు ఆటలు పోటీల్లో విజేతలకు ఆమె బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల నిర్వహణతో అన్ని వర్గాల ప్రజల్లో మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు. మాజీ సర్పంచ్ మాకిరెడ్డి వెంకటరమణ, నర్సీపట్నం యూనియన్ బ్యాంకు మేనేజరు పైల నాని, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.